

రియల్టర్ల కొత్త దందా..
పొలాల్లో రైతులకు మేలు చేయాల్సిన సారవంతమైన మట్టి.. రియల్టర్ల కబంధ హస్తాల్లో చిక్కుకుంటోంది. 8లో



రసాభాసగా జెడ్పీ సమావేశం
జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
42° / 28°
జిల్లాలో శనివారం ఎండలు తీవ్రంగా ఉంటాయి. దీనికి తోడు వడగాలులు సైతం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఇక 24 గంటలూ వైద్య సేవలు



ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచరూరల్/సుజాతనగర్ : జిల్లాలోని సుజాతనగర్, పాల్వంచ మండలం ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జూలై 1 నుంచి 24 గంటలూ వైద్య సేవలు అందిస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష తెలిపారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రులు 12 గంటలు మాత్రమే పని చేస్తున్నాయని, ఇకపై నిరంతరం తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. ఆయా మండలాల ప్రజలు ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం ఉల్వనూరు పీహెచ్‌సీలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్‌నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా ఇకపై ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు స్వీపర్లను నియమిస్తామని తెలిపారు.

ఇదేం దారిద్ర్యం !



ఇల్లెందు పట్టణ వ్యూ

జిల్లా మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్ 930పీ
- నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు తగ్గనున్న దూరం
- జాతీయ రహదారి డిజైన్‌లో ఇల్లెందుకు బైపాస్ రోడ్డు
- కానీ నిర్మాణమంతా ఖమ్మం జిల్లాలోనే..
- ఎంపీ కవిత దృష్టి సారించాలంటున్న జిల్లా వాసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రైళ్లు, రోడ్లు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు, వైద్యం, రవాణా.. ఇలా అనేక రంగాల్లో దశాబ్దాల తరబడి అభివృద్ధికి దూరంగా ఉన్న ఇల్లెందులో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ఈ సమయంలోనే ఇల్లెందు మీదుగా హైదరాబాద్ – కొత్తగూడెం జాతీయ రహదారి 930పీ మంజూరైంది. దీంతో పట్టణానికి మరో మంచి అవకాశం దక్కినట్టయ్యింది. మూడేళ్లుగా ఈ జాతీయ రహదారికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. అయితే కీలకమైన దశలో అడుగులు తడబడుతున్నాయి. అభివృద్ధికి ఊతం ఇచ్చే జాతీయ రహదారి ఇల్లెందుకు దూరంగా ఖమ్మం జిల్లాలోకి వెళ్లేలా జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు సమగ్ర ప్రణాళిక (డీపీఆర్) రూపొందించారు. దీని ప్రకారమే భూసేకరణ పనులు సైతం మొదలవుతున్నాయి.

నెహ్రూ నగర్‌లో మొదలు..
జాతీయ రహదారుల సంస్థ హైదరాబాద్ రింగ్‌రోడ్డులోని గౌరెల్లి జంక్షన్ నుంచి యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల మీదుగా కొత్తగూడెం వరకు 930పీ నంబర్‌తో కొత్త నేషనల్ హైవే ప్రకటించింది. ఈ దారి అందుబాటులోకి వస్తే జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి సుమారు 35 కి.మీ. దూరం తగ్గనుంది. జిల్లాలో ఇల్లెందు మండలంలోని నెహ్రూనగర్‌లో ఈ రోడ్డు ప్రారంభమై ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలంలో కొంత దూరం ప్రయాణించి.. ఇల్లెందు మండలం సుదిమళ్ల పంచాయతీ పరిధిలో తిరిగి భద్రాద్రి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి టేకులపల్లి మీదుగా కొత్తగూడెం వరకు మొత్తం 52 కి.మీ. రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ.842 కోట్లు మంజూరు చేశారు.

పేరుకే ఇల్లెందు బైపాస్..
జాతీయ రహదారి 930పీని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిగా విస్తరిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ అంటే ప్రస్తుతం ఉన్న మార్గాన్నే రెండు, నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడం. అయితే ఇల్లెందు వరకు వచ్చేసరికి ప్రస్తుతం ఉన్న రోడ్డును కాకుండా పట్టణానికి బైపాస్ రోడ్డును ప్రతిపాదించారు. ఈ బైపాస్ రోడ్డు ఇల్లెందు శివారులో ఉన్న రాజీవ్‌నగర్ దగ్గర మొదలై ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలం ఉసిరికాయపల్లి గ్రామపంచాయతీలోకి వెళ్తుంది. అక్కడి నుంచి అదే మండలంలోని లలితాపురం దగ్గర ఇల్లెందు – ఖమ్మం రోడ్డుకు కలుస్తుంది. ఆ తర్వాత భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు మండలం సుదిమళ్ల పంచాయతీలోకి వస్తుంది. ఇల్లెందు పట్టణం చుట్టూ పది కిలోమీటర్ల మేరకు బైపాస్ ప్రతిపాదించగా ఇందులో ఏడు కిలోమీటర్లు ఖమ్మం జిల్లా పరిధిలోనే ఉండనుంది. పట్టణం ఓ జిల్లాలో, బైపాస్ రోడ్డు మరో జిల్లాలో ఉండడంతో భవిష్యత్‌లో ఈ రోడ్డు ఆధారంగా ఏ తరహా కార్యక్రమాలు చేపట్టాలన్నా ఇరు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాల్సి వస్తుంది. ఫలితంగా పనుల్లో వేగం మందగించే అవకాశం ఉంటుంది.

ముందు డిజైన్‌లో మరోలా..
ఎన్‌హెచ్ 930పీ ముందుగా సిద్ధం చేసిన డీపీఆర్‌లో నెహ్రూనగర్‌లో మొదలైన రోడ్డు ఇల్లెందు పట్టణంలోని గోవింద్ సెంటర్‌కు వస్తుంది. అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన వాణిజ్య కూడళ్ల మీదుగా కాకుండా సత్యనారాయణపురం నుంచి పట్టణం బయటకు వెళ్లి తిరిగి సుదిమళ్ల వద్ద ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారికి కలుస్తుంది. ఈ డిజైన్ అమల్లోకి వస్తే హైవే అంతా జిల్లా పరిధిలోనే ఉంటూ ఇల్లెందు పట్టణ అభివృద్ధికి జీవనాడిగా ఉండేది. కానీ కొత్త డిజైన్‌తో ఇల్లెందుకే కాదు.. అసలు జిల్లాకే సంబంధం లేకుండా పోయింది. ఇప్పటికే నెహ్రూనగర్ నుంచి కారుకొండ వరకు భూసేకరణ కోసం గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి.

భూసేకరణ నోటిఫికేషన్ వివరాలిలా..

హైవే పనులు	నిడివి	గెజిట్ వచ్చిన తేదీ
నెహ్రూనగర్ – చల్లసముద్రం	11 కి.మీ	2023 మే 1
చల్లసముద్రం–ఉసిరికాయలపల్లి	7 కి.మీ	2023 మార్చి 15
సుదిమళ్ల – కారుకొండ	34 కి.మీ	2023 మే 1

ఎంపీ కవిత దృష్టి సారిస్తేనే..
ఇప్పటికే ఇల్లెందులో ఒక్కొక్కటిగా బొగ్గు గనులు మూత పడుతూ వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో వరంలా కనిపించిన జాతీయ రహదారి సైతం ఇల్లెందుకు సొంతం కాకుండా పొరుగు జిల్లాలోకి వెళ్లనుంది. ఎన్‌హెచ్ 930 పీ భూసేకరణ ప్రక్రియ మొదలైన నేపథ్యంలో ఇల్లెందు బైపాస్ విషయంలో ప్రజాప్రతినిధులు తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత చొరవ చూపించాల్సిన అవసరం ఉంది. లేదంటే తన పార్లమెంట్ నియోజకవర్గ పరధిలోని కీలకమైన నియోజకవర్గ కేంద్రానికి అన్యాయం జరిగే అవకాశం ఉంది.

అన్ని వర్గాలకూ ‘సంక్షేమం’





మణుగూరు మండలం గట్టుమల్లారంలో గొర్రెలు పంపిణీ చేస్తున్న రేగా కాంతారావు, అనుదీప్ (ఇన్‌సెట్) బూర్గంపాడులో కులవృత్తుల వారికి చెక్కులను అందిస్తున్న విప్, కలెక్టర్

విప్ రేగా కాంతారావు, కలెక్టర్ అనుదీప్

మణుగూరు రూరల్/బూర్గంపాడు : తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు, ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, కలెక్టర్ అనుదీప్ అన్నారు. మండలంలోని గుట్టమల్లారంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సంక్షేమ శాఖ పండుగ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన విప్ రేగా, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. ఆసరా పెన్షన్లు, రైతుబంధు, దళిత బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఎస్పీ రాఘవేంద్రరావు, మణుగూరు జెడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు, తహసీల్దార్ కె. నాగరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..
యాదవుల సంక్షేమం, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని విప్ రేగా కాంతారావు, కలెక్టర్ అనుదీప్ అన్నారు. మణుగూరు మండలం గట్టుమల్లారంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ అనంతరం వారు మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు మేకలు, గొర్రెలు సబ్సిడీపై అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. ప్రభుత్వ సాయంతో లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.

కులవృత్తుల వారి అభ్యున్నతే లక్ష్యం
కుల, చేతివృత్తుల వారి అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రేగా కాంతారావు అన్నారు. మణుగూరు మండలం గుట్టమల్లారం, బూర్గంపాడులో కలెక్టర్ అనుదీప్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులవృత్తులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బూర్గంపాడు ఎంపీడీఓ వివేక్‌రామ్, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐడీఓసీలో సుపరిపాలన దినోత్సవం

కలెక్టర్ అనుదీప్ వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐడీఓసీలో శనివారం ఉదయం 10 గంటలకు సుపరిపాలనా దినోత్సవం, 11వ తేదీన సాహిత్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన సంస్కరణలు, ఫలితాలపై జిల్లా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. సుపరిపాలనా దినోత్సవ ఏర్పాట్లను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, సాహిత్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డీపీఆర్‌ఓ, డీఈఓ, ఇంటర్మీడియట్ అధికారి, శిశుసంక్షేమ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్లు, కొత్త జిల్లాలు తదితర వివరాలతో కరపత్రం తయారుచేసి పంపిణీ చేయాలన్నారు. వీటివల్ల ప్రజలకు దూరభారం తగ్గడమే కాకుండా పరిపాలనా పరమైన పర్యవేక్షణ సులభమైందనే విషయాలను వివరించాలని ఆదేశించారు. వివిధ శాఖల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని, తద్వారా ప్రజాజీవితంలో వచ్చిన మెరుగుదలపై నివేదిక తయారు చేయాలని సీపీఓకు సూచించారు.

గడీల రాజ్యాన్ని తరిమికొడదాం..

- జాకీ పెట్టి లేపినా కాంగ్రెస్ లేచే పరిస్థితి లేదు
- అమిత్‌షా సభ సక్సెస్‌తో సత్తా చాటుదాం
- సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణలో రాబోయేది కాషాయ రాజ్యమేనని, గడీల రాజ్యాన్ని తరిమికొట్టడానికి ఐదు నెలలే ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈనెల 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరు కానుండగా, శుక్రవారం వచ్చిన సంజయ్ ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో బీజేపీ సత్తా ఏమిటో నిరుద్యోగ మార్చ్‌తో చాటామని, ఈనెల 15న జరిగే అమిత్ షా సభను సక్సెస్ చేసి మరోసారి దమ్ము చూపిద్దామని పిలుపునిచ్చారు. ఖమ్మంకు అమిత్ షా వస్తున్నారని తెలియగానే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెమటలు పడుతున్నాయన్నారు. అమిత్‌షా సభ సక్సెస్ అయ్యాక అవసరమైతే ప్రధాని మోదీ సభను కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కాగా, తెలంగాణతో పాటు కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దేశంలో కాంగ్రెస్ ఎక్కడా లేదని, జాకీ పెట్టి లేపినా లేవదన్నారు. అలాగే, కమ్యూనిస్టుల పనైపోయిందన్నారు. సూది, దబ్బణం పార్టీలని అవమానించిన కేసీఆర్ పంచనే చేరిన సిగ్గు, శరం లేని నేతలు కమ్యూనిస్టులని సంజయ్ ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్ అరాచకాలకు అంతేలేదు..
ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయిందని సంజయ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ బాధితుల సంఘం సమావేశం పెడితే సర్దార్ పటేల్ స్టేడియం కూడా సరిపోదని పేర్కొన్నారు. కొందరు పోలీసులు బీఆర్‌ఎస్‌కు తలొగ్గి బీజేపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నా భయపడే కార్యకర్తలు బీజేపీలో లేరన్నారు. ఖమ్మం జిల్లాలో నేతల ఆగడాలకు బలైపోయిన సాయి గణేష్ త్యాగాలను వృథా కానివ్వమని చెప్పారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. సీఎం సహా మంత్రులు జిల్లాల్లో పర్యటించాలంటే బీజేపీ కార్యకర్తలను చూసి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. భద్రాచలం రామాలయం అభివృద్ధికి ఇస్తామన్న రూ.100 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు, నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం వంటివేమీ అమలుకాలేదని ఎద్దేవా చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మిస్తున్న ఘనత ప్రధాని మోదీదైతే... భద్రాచలం సీతారాముడి కల్యాణానికి తలంబ్రాలు కూడా తీసుకెళ్లని చరిత్ర కేసీఆర్‌దని, ఎవరు నిజమైన రామభక్తులో చెప్పాలన్నారు.

సందడి చేసిన బండి
అమిత్‌షా సభ నిర్వహణ కోసం సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానాలను పరిశీలనకు వచ్చిన బండి సంజయ్ సందడి చేశారు. అక్కడ చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఆ తర్వాత నేతలు, కార్యకర్తలతో నడుస్తూ వెళ్లి కేఫ్‌లో చాయ్ తాగారు. ఈ సమావేశంలో బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, మాజీమంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎం.ధర్మారావు, కొండేటి శ్రీధర్, కుంజా సత్యవతి, నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, గల్లా సత్యనారాయణ, కోనేరు చిన్ని, బొబ్బ భాగ్యారెడ్డి, రామచంద్రారెడ్డి, రావు పద్మ, కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, పాల్వాయి రజని, సినీ నటి కవిత, గీతామూర్తి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కడగంచి రమేశ్, విద్యాసాగర్‌రెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, రుద్ర ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.28,25,591



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.భేల్‌సింగ్, ఈఓ ఎస్.రజనీకుమారి పర్యవేక్షణలో లెక్కించగా రెండు నెలల 23 రోజులకు గాను రూ.28,25,591 ఆదాయం నమోదైంది. అలాగే, మిశ్రమ వెండి, బంగారం కూడా లభించాయని ఈఓ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు, కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ పి.మదన్‌మోహన్, పాల్వంచ శ్రీనివాసగిరి సేవాదళ్ బృందం, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపార దుకాణాలకు టెండర్లు పూర్తి
పెద్దమ్మగుడి వద్ద రెండు వ్యాపార దుకాణాలతో పాటు చీరలను పోగు చేసుకునే బాధ్యతలు అప్పగించేందుకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో నంబర్ షాపు నెలకు రూ.2.20లక్షలు, రెండో నంబర్ షాపు నెలకు రూ.50,100తో పాటు చీరలు పోగు చేసుకునేందుకు రూ.12.16లక్షలకు వేలం ఖరారైంది. కాగా, ఒకటో నంబర్ షాపునకు గత ఏడాది రూ.2.90లక్షల అద్దె లభించగా ఈసారి రూ.70వేల తక్కువకే అప్పగించారు. సరైన పాట రావడం లేదని రెండు సార్లు వేలం వాయిదా అధికారులు ఈసారి తక్కువ అద్దె వస్తున్నా ఖరారు చేయడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేయితోనే చేయి కలుపుదాం..

- కాంగ్రెస్‌లో చేరాలని పొంగులేటి అనుచరుల ఏకాభిప్రాయం
- పది నియోజకవర్గాల నేతల సమావేశంలో వెల్లడి
- అనుచరుల అభీష్టం మేరకే నిర్ణయమన్న శ్రీనివాసరెడ్డి
- ఈ నెలాఖరులోగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐదు నెలల రాజకీయ ఉత్కంఠకు తెరదించారు. అనుచరుల అడుగు జాడల్లోనే నడుస్తానని, వారి అభీష్టమే తన నిర్ణయమని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో హైదరాబాద్ వేదికగా ఏ పార్టీలో చేరతానన్న నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. ఈ నెలాఖరులోనే భారీ బహిరంగ సభ ఖమ్మంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి 1న బీఆర్‌ఎస్‌పై తిరుగుబావుటా ఎగురవేసిన ఆయన ఐదు నెలల పది రోజుల తర్వాత కాంగ్రెస్‌లోనే చేరనున్నట్లుగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశానికి పది నియోజకవర్గాల నుంచి ఆయన అనుచరులు భారీగా తరలివచ్చారు. ఈ సమావేశం వేదికగా అటు పాలకులపై ఘాటు వ్యాఖ్యలు చేయడంతోపాటు ఇక ముందు రాజకీయ ఫైట్ అంటూ అనుచర నేతలను కార్యోన్ముఖులను చేస్తూ ప్రసంగించారు.

ఒక్కొక్కరుగా వచ్చి.. జై కాంగ్రెస్ అని..
ఉదయం 8 గంటల నుంచే పది నియోజకవర్గాల నుంచి పొంగులేటి అనుచరులు చేరుకోగా.. ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల నుంచి ఐదుగురు చొప్పున తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆ తర్వాత వైరా, పాలేరు, మధిర, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల అనుచరులు మాట్లాడారు. 2019 నుంచి పొంగులేటికి అన్యాయం జరుగుతున్నందున కాంగ్రెస్‌లో చేరితేనే అన్యాయం చేసిన వారికి దీటైన సమాధానం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరితే ఉమ్మడి జిల్లాలో తమ సత్తా నిరూపిస్తామన్నారు. ఈ సమయాన అనుచరులందరూ జై కాంగ్రెస్ అంటూ నినదించారు. రెండున్నర గంటలపాటు ఈ సమావేశం సాగింది. చివరకు అన్ని నియోజకవర్గాల నేతలు పొంగులేటి కాంగ్రెస్‌లోనే చేరాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

అనుచరుల్లో జోష్..
పొంగులేటి ఈ సమావేశంలో అర గంటకు పైగా మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరితే తండ్రి సమానమైన వ్యక్తే టికెట్ ఇవ్వలేదని చెబుతూ, తనకు పదవులు కాకుండా ప్రజాసేవే ముఖ్యమంటూ పేర్కొన్నారు. ‘పలు దఫాలుగా మీతో పార్టీలో చేరిక విషయమై అభిప్రాయ సేకరణ చేసినా చివరకు మీ నిర్ణయం ప్రకారమే నేను నడుస్తాను’ అని తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా తనను ఆదరిస్తున్నారని, అందరం కలిసి యుద్ధం చేద్దామంటూ వ్యాఖ్యానించారు. ఏ పార్టీలో చేరుతున్నాననేది హైదరాబాద్‌లో రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామని.. ఢిల్లీ ముఖ్యనేతలతో మాట్లాడాక ఖమ్మంలో భారీ బహిరంగ సభ తేదీ ఖరారు చేస్తామని తెలిపారు. ఇది ఈ నెలాఖరులోగానే ఉండొచ్చని చూచాయగా చెప్పుకొచ్చారు. దీంతో పొంగులేటి కాంగ్రెస్‌లోకే వెళ్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లయింది.

ఖమ్మం నుంచే పోటీ చేయండి..
పొంగులేటి మాట్లాడుతున్న సమయాన అనుచర నేతలు ఆయన ఖమ్మంలోనే పోటీచేయాలంటూ నినదించారు. జై పొంగులేటి.. జై కాంగ్రెస్.. జై ఖమ్మం అంటూ నినాదాలు చేశారు. పది నియోజకవర్గాల నుంచి పరిమిత సంఖ్యలో నేతలనే ఆహ్వానించినా అంతకుమించి హాజరయ్యారు. సమావేశం అనంతరం కొందరు ముఖ్యనేతలతో పొంగులేటి తన నివాసంలో సమీక్షించాక హైదరాబాద్ వెళ్లారు. ఈ సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నేతలు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, మచ్చా శ్రీనివాస్‌యాదవ్, తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, విజయాబాయి, జారె ఆదినారాయణ, ఆకుల మూర్తి, మేకల మల్లిబాబు యాదవ్, గుండా వెంకటరెడ్డి, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, జాలె జానకిరెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

ఈఎంఆర్ఐలో ఉద్యోగ అవకాశాలు

కొత్తగూడెంఅర్బన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థలో పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 108 వాహనాల్లో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), 102, 1962, 108 వాహనాల డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 12న సోమవారం ఉదయం కొత్తగూడెంలోని రామవరం ఎంసీహెచ్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఈఎంటీ కోసం డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఏఎన్ఎం పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 73309 22279 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

ములకలపల్లి: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సత్యంపేట శివారులో అక్రమంగా క్వారీ ఏర్పాటు చేసి, మట్టి తరలిస్తున్నట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి ఒక జేసీబీతో పాటు ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమలరావు తెలిపారు. అలాగే, మండలంలోని తాళ్లపాయ శివారు మీదుగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తీసుకొస్తున్న లారీని గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దమ్మపేట: ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గట్టుగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూచి లక్ష్మి(40), రామస్వామి దంపతులు గట్టుగూడెం నుంచి సత్తుపల్లి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గట్టుగూడెం క్రాస్ రోడ్డు వద్ద అశ్వారావుపేట నుంచి అతి వేగంగా వస్తున్న డీసీఎం బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు సత్తుపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందింది. కాగా, రామస్వామికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


వాహనంతో ఎస్‌ఐ విజయలక్ష్మి

చండ్రుగొండ: ఏపీలోని కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సీతాయిగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యంతో వెళ్తున్న వాహనం పట్టుబడింది. దీంతో 40క్వింటాళ్ల బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు.

7 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి, నిందితులను చూపిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్ : అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ సిబ్బందితో భద్రాచలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బ్రిడ్జి సెంటర్‌లోని అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ప్లాస్టిక్ బస్తాల్లో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా, పట్టుబడిన గంజాయి ఏడు కిలోలు ఉండగా, దాని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితులను కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన ఎల్లబోయిన సురేశ్, మారుతి వెంకటేష్‌గా గుర్తించారు. తనిఖీల్లో సీఐ, ఎస్‌ఐలు పి.సామ్యూల్ జాన్, షేక్ ముబషీర్ అహ్మద్, కరీం, జి.బాలు, హెడ్ కానిస్టేబుళ్లు కె.సుధీర్, టి.వెంకటేశ్వర్లు, వి.హనుమంతరావు, పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రియల్టర్ల కొత్త దందా..

- పొలం పేరుతో చెరువు మట్టికి అనుమతులు
- వెంచర్లలోకి తరలుతున్న సారవంతమైన మట్టి
- ఎవరొచ్చినా దందా ఆపేది లేదంటూ బెదిరింపులు


వెంచర్‌లోకి తరలించిన మట్టి కుప్పలు

సుజాతనగర్: రైతులకు మేలు చేయాల్సిన సారవంతమైన మట్టి రియల్టర్ల కబంధ హస్తాల్లో చిక్కుకుంటోంది. పంటలు ఏపుగా ఎదిగేందుకు దోహదపడాల్సిన మట్టి పునాదుల కిందకు వెళుతోంది. పొలం పేరుతో అనుమతి తీసుకున్న మట్టిని అక్రమంగా వెంచర్ అవసరాల నిమిత్తం తోలుతున్నా సంబంధిత అధికారులకు కనీస పట్టింపు కరువైంది. సుజాతనగర్ మండలం నాయకులగూడెంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ వేశాడు. అన్ని రకాల అనుమతులు రాకముందే ఆకర్షణీయంగా కరపత్రాలు ముద్రించి ప్లాట్లు అమ్మకానికి పెట్టాడు. సదరు రియల్టర్ మాటలు నమ్మి, ప్లాట్లు కొనుగోలు చేద్దామని వచ్చిన వారు అక్కడున్న ఎగుడుదిగుడు నేలను చూసి పెదవి విరిచారు. దీంతో క్వారీల నుంచి మొరం మట్టిని తెచ్చి వెంచర్‌ను చదును చేయాల్సిన రియల్టర్.. ఖర్చు మిగుల్చుకునేందుకు అడ్డదారులు తొక్కాడు. పొలంలోకి సింగభూపాలెం చెరువు మట్టి కావాలంటూ మైనర్ ఇరిగేషన్ అధికారులను అనుమతి అడిగాడు. ఆయన అడిగిందే తడవుగా 1000 ట్రాక్టర్ల మట్టిని తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

పర్యవేక్షణ ఏదీ?

'అనుమతులు ఇవ్వడమే మా పని, క్షేత్ర స్థాయిలో ఏం జరిగినా మాకు సంబంధం లేద'న్నట్టుగా మైనర్ ఇరిగేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో సదరు రియల్టర్ చెరువు నుంచి తోడిన మట్టిని పొలంలోకి కాకుండా నేరుగా వెంచర్‌లోకి తరలిస్తున్నాడు. ట్రిప్పుల మీద ట్రిప్పులు వేస్తూ చెరువు మట్టిని వెంచర్‌కు పట్టపగలే చేరవేస్తున్నాడు. ఇంత దందా సాగుతున్నా ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్ అధికారులు ఎవరూ తమకు సంబంధం లేనట్టుగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ట్రాక్టర్ల ద్వారా తరలిపోతున్న మట్టి నిజంగా పొలంలో పోస్తున్నారా, మరెక్కడైనా పోస్తున్నారా అనే విషయాలను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

రైతుల ఆవేదన..

చెరువు మట్టి ఎంతో సారవంతమైనది. వర్షపు చినుకులు వరదలుగా మారి ప్రవహిస్తూ ఎన్నో ఖనిజాలు, లవణాలు, ఇతర పోషకాలను చెరువుల్లోకి తీసుకొస్తాయి. దీంతో చెరువుల అడుగు భాగంలో సారవంతమైన ఒండ్రు పేరుకుపోతుంది. గతంలో మిషన్ కాకతీయ సమయంలో ఈ సారవంతమైన మట్టిని పొలాలకు విరివిగా ప్రభుత్వం తరలించింది. ఇంతటి సారవంతమైన మట్టిని పొలాల్లోకి కాకుండా వెంచర్లకు తరలించడంతో రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

డ్రైవర్లకూ లైసెన్సులు లేవు..

సదరు వెంచర్‌లో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్లకు కనీసం లైసెన్సులు కూడా లేవు. మైనర్లు సైతం ట్రాక్టర్లు ఎక్కి డ్రైవరు సీటులో నిలబడి డ్రైవింగ్ చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆఖరికి మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ సైతం లేదు. టీఆర్ నంబర్లతోనే ఇంతకు తెగించడం గమనార్హం.

అడ్డొస్తే ఢీ కొడతాం..

జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండంతో స్థానికులు వెంటనే ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులకు తెలిపారు. స్థానికులు, మీడియా వెంచర్ దగ్గరకు వెళ్లి చెరువు మట్టిని ఇక్కడికెందుకు తరలిస్తున్నారని ప్రశ్నించగా.. మీరెందుకు ఇక్కడికి వచ్చారు.. ఇక్కడ మట్టి పోసుకుంటే మీకేంటి బాధ, ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ట్రాక్టర్లతో ఢీ కొడతాం తప్పితే మట్టి తరలింపును ఆపేదే లేదంటూ తలబిరుసుగా వ్యవహరించారు. అధికారుల అండదండలు లేనిదే రియల్టర్లు ఇంతకు బరితెగించారా అనే ఆరోపణలు వస్తున్నాయి.

'ఆర్‌అండ్‌బీ'కి మోక్షం


కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం

- నేడు రుద్రంపూర్‌లో సర్కిల్ కార్యాలయం ప్రారంభం
- కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లుగా విభజన
- అదనంగా మరో 20 మంది సిబ్బంది నియామకం

కొత్తగూడెంటౌన్: రహదారులు, భవనాల శాఖకు కొత్తగూడెంలో ఎట్టకేలకు సర్కిల్ కార్యాలయం సిద్ధమైంది. ఇందుకోసం రుద్రంపూర్‌లోని 36వ నంబర్ సింగరేణి క్వార్టర్‌ను కేటాయించారు. భద్రాద్రి జిల్లా విభజన తర్వాత ఇప్పటివరకు ఆర్‌అండ్‌బీ శాఖకు కార్యాలయం లేకపోవడంతో టెండర్లు, బిల్లులు వంటి ప్రతీ పనికి ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. ఇకపై కొత్తగూడెంలోనే అన్ని పనులూ జరుగనున్నాయి. ప్రస్తుతం కొత్తగూడెం, భద్రాచలంలోని డీఈ కార్యాలయాలు, జిల్లాలోని ఇతర మండలాల్లో కలిపి ప్రస్తుతం 40 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు భద్రాచలం ఎంపీడీఓ కార్యాలయంలో డీఈ ఆఫీస్ నిర్వహిస్తుండగా అక్కడ కూడా నూతన భవనం కేటాయించారు. కొత్తగూడెం ఎస్ఈ, భద్రాచలం డీఈ కార్యాలయాల్లో కలిపి కొత్తగా మరో 20 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించనున్నారు.

ఖమ్మం ఎస్ఈనే ఇక్కడ ఇన్‌చార్జ్..

జిల్లాకు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం కేటాయించినప్పటికీ.. ఇంకా ఎస్ఈని నియమించలేదు. ప్రస్తుతానికి ఖమ్మం ఎస్ఈ బి.లక్ష్మణ్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. జిల్లా కార్యాలయం ఏర్పాటుతో కొత్తగా 10 మంది సిబ్బందిని కేటాయించారు. వారిలో ఒక డీఈ, ఇద్దరు జేఈలు, ఇద్దరు క్లర్క్‌లు, ఒక అటెండర్‌తో పాటు నలుగురు సిబ్బంది రానున్నారు. భద్రాచలం డివిజన్ కార్యాలయంలో కూడా ఇద్దరు జేఈలు, ఇద్దరు క్లర్క్‌లు, ఇద్దరు అటెండర్లతో పాటు మరో నలుగురు సిబ్బందిని కేటాయించనున్నారు. జిల్లాకు ఎట్టకేలకు పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుతో అధికారులకు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు డివిజన్లు, ఏడు సబ్ డివిజన్లు..

జిల్లాలో కొత్తగా సర్కిల్ ఏర్పడగా, దీని పరిధిలో కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాలుగా రెండు డివిజన్‌లు, మరో ఏడు సబ్ డివిజన్లు, 27 సెక్షన్‌లు ఉన్నాయి. కొత్తగూడెం డివిజన్ పరిధిలో కొత్తగూడెం, కొత్తగూడెం భవనాల శాఖ, ములకలపల్లి, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం డివిజన్‌లో భద్రాచలం, పినపాక సబ్ డివిజన్లుగా ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖను పటిష్ట పరచడంతో పాటు ప్రజావసరాల దృష్ట్యా పనులు చేపట్టేందుకు నూతన ఎస్ఈ కార్యాలయం దోహదపడనుంది. అంతకాక వరదల వంటి విపత్తుల సమయంలో ప్రజలకు కలిగే అసౌకర్యాలను తొలగించి యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టేందుకు, తక్షణమే నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని స్థానిక అధికారులు చెబుతున్నారు.

నీళ్ల చారు, పల్చటి మజ్జిగ

ఇదీ ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో డైట్


నీళ్ల చారు, మజ్జిగ చూపిస్తున్న మహిళ

ఇల్లెందు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన భోజనం అందించాలనే నిబంధనలు, ఏర్పాటుచేసిన బోర్డుల్లోని సూచనలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు గురువారం రాత్రి నిరసన తెలిపారు. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో రెండు రోజుల క్రితం ఏడుగురికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయగా, గురువారం రాత్రి ఓ ప్లేట్‌లో భోజనం, గ్లాసులో నీళ్ల చారు, మరో గ్లాసులో పల్చటి మజ్జిగ తీసుకొచ్చి ఇచ్చారు. అయితే, నిబంధనల ప్రకారం వెజ్ కర్రీ, గుడ్డు, పుల్కా, అరటి పండు ఉండకపోవడంతో ఆపరేషన్ చేయించుకున్న కొందరు సిబ్బందిని నిలదీశారు. దీంతో దివ్య, ఉమ తదితర మహిళలపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారని బాధితులు తెలిపారు. ఇక టిఫిన్, మధ్యాహ్న భోజనంలోనూ అదే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఈ విషయమై డీసీహెచ్ఎస్ రవిబాబును వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రసాభాసగా జెడ్పీ సమావేశం


మాట్లాడుతున్న కోరం కనకయ్య

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొదట అజెండాలోని అంశాల వారీగా ప్రగతిని అధికారులు వివరించారు. ఈ క్రమంలో ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి మాట్లాడుతూ.. సమస్యలు తెలియజేసేందుకు సమావేశాలకు హాజరవుతున్నా అధికారులు మాత్రం రావడం లేదని ఆరోపించారు. వారి నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ పోడియం ముందు కూర్చుని నిరసన తెలియజేశారు. అటవీ శాఖ అధికారులు ఎందుకు సమావేశానికి హాజరుకాలేదని నిలదీశారు. ప్రభుత్వం పోడుపట్టాల విషయంలో మాయమాటలు చెబుతోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు కలగజేసుకొని ముఖ్యమంత్రి త్వరలోనే పోడుపట్టాలు ఇస్తామని చెప్పినా కొందరు కావాలని రాజకీయం చేస్తున్నారని అన్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, తక్షణమే అలాంటి గ్రామాలను గుర్తించి నీరందించాలని కోరారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రజాప్రతినిధులు తీసుకొస్తున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను సమకూర్చాలని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించినప్పుడే అధికారులు ప్రజల మన్ననలు పొందుతారని అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. జెడ్పీ సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడం తగదని, ఇకముందు ఇలాంటి చర్యలు పునరావృతం కావద్దని చెప్పారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రద్దయిన రైళ్లు పునః ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: నెక్కొండ స్టేషన్ వద్ద జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా గత నెల 21 నుంచి భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి నడిచే పలు రైళ్లు రద్దు కాగా, శుక్రవారం పునఃప్రారంభం అయ్యాయి. అయితే బెళగావి రైలు మాత్రం ఈనెల 12 నుంచి నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. అది కూడా జూలై 1 వరకు వస్తుందని, ఆ తర్వాత పొడగించే అవకాశం ఉంటుందని తెలిపారు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఊళ్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇలాంటి కీలక సమయంలో రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు మళ్లీ ప్రారంభం కావడంతో వేసవి సెలవులకు వెళ్లిన వారికి కొంచెం సౌకర్యంగా ఉండనుంది.

పాస్టర్ ఇంట్లో చోరీ

బంగారు, వెండి నగలతో పాటు నగదు అపహరణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్‌బస్తీ గొల్ల గూడెంలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాస్టర్ సింగారపు ఆముదారాజు మే 26న బెంగళూరులోని తన కుమార్తె ఇంటికి వెళ్లి ఈనెల 7న తిరిగి కొత్తగూడెం వచ్చారు. ఇంట్లో తాళం పగుటకొట్టి ఉండగా, లోనికి వెళ్లి చూసేసరికి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న ఐదు ఇనుప బీరువాలను పగులగొట్టి ఎనిమిది బంగారపు ఉంగరాలు (ఒక్కోటి మూడు గ్రాములు), ఐదు జతల వెండి పట్టీలు, వెండి మొలతాడుతో పాటు రూ.1.10 లక్షల నగదు అపహరించారు. ఈ మేరకు గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరిశీలించి శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రూ.1.10లక్షల నగదుతో పాటు బంగారు, వెడి నగల వి లువ రూ.70 వేలు ఉంటుందని వెల్లడించారు.

గ్రూప్–1 పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎస్పీ వినీత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 11న నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చూడాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. పరీక్ష నిర్వహణపై శుక్రవారం ఐడీఓసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులు షూ వేసుకుని రావద్దని, ఉదయం 8 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 10.15 తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించరని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ల రూముల్లో సీసీ కెమెరాలు ఉండాలన్నారు. పోలీస్ కస్టడీ నుంచి ప్రశ్నాపత్రాల తరలింపులో ఎస్కార్టు వాహనం ఏర్పాటుచేయాలని, పరీక్ష పూర్తయిన తరువాత కూడా బందోబస్తుతో రిసెప్షన్ కేంద్రాలకు రావాలని అన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. జిల్లాలో 8,851 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల్లో 22 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. దివ్యాంగులకు మొదటిఫ్లోర్‌లో సీటింగ్ ఏర్పాటు చేయాలని స్క్రైబ్‌ను అదనంగా ఇద్దరిని అందుబాటులో ఉండాలని అన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. కేంద్రాలకు 100 మీటర్ల వరకు ఎవరికీ అనుమతి లేదని, వాహనాల పార్కింగ్ కూడా ఉండదని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో ఎస్ఐలతో పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. చీఫ్ సూపరింటెంట్లు, లైజన్ అధికారులకు తప్ప ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదని, తనిఖీకి వచ్చిన అధికారులకు కూడా అనుమతి లేదని అన్నారు.

ఇదేం 'రిక్రూట్‌మెంట్' ?


సింగరేణి ప్రధాన కార్యాలయం

- కోర్టు తీర్పు వెలువడకముందే వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక ప్రక్రియ
- సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ అధికారుల వింత పోకడ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్‌కు సంబంధించి ఏదైనా నోటిఫికేషన్ అంశం కోర్టులో ఉంటే అది ఎంత కాలమైనా తీర్పు వచ్చేంత వరకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టేది కాదు. కానీ ప్రస్తుతం ఆ శాఖ అధికారులు కొత్తగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 21న జరిగిన వెల్ఫేర్ ఆఫీసర్ ట్రైనీ ఇంటర్నల్ పోస్టులకు సంబంధించి తమకు పోస్టులు కేటాయించలేదంటూ మహిళా అభ్యర్థులు మే 25న కోర్టును ఆశ్రయించగా జూన్ 6న దీనిపై చర్చించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. అయితే రిక్రూట్‌మెంట్ సెల్ అధికారులు ఆగమేఘాలపై ఈనెల 2న సెలెక్టెడ్ లిస్ట్ పెట్టడమే కాక ఆయా అభ్యర్థులు 5వ తేదీన వైద్య పరీక్షలకు హాజరు కావాలంటూ ఎంపికైన వారిని ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు పంపించారు. ఇక మెడికల్ రిపోర్టులు కనీసం వారం రోజుల తర్వాత కానీ వెలువరించని సింగరేణి ఆస్పత్రి అధికారులు సైతం వెంటనే నివేదికలు ఇవ్వడం గమనార్హం. సదరు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం కూడా గురువారం పూర్తయింది. అయితే ఇంత అర్జెంట్‌గా ఈ ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. 133 సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఇంతవరకూ ఎప్పుడూ ఇలా జరగలేదని అంటున్నారు. ఇదిలా ఉండగా వెల్ఫేర్ ఆఫీసర్ నియామక పరీక్షకు సింగరేణి వ్యాప్తంగా సుమారు 700 మంది హాజరు కాగా, వారిలో కార్పొరేట్ కార్యాలయంలో పనిచేసే వారికే ఎక్కువ పోస్టులు రావడం పట్ల కార్మికులు, ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా సింగరేణి కార్పొరేట్ విజిలెన్స్ విభాగంలో పనిచేసే వారినే వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక చేశారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయమై రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం బసవయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

ఐటీడీఏ ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్ తదితరులు

దుమ్ముగూడెం: బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ డీడీ, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తల్లిదండ్రులను కోరారు. దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెం, నారాయణపేట, సింగవరం, గుర్రాల గుంపు తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి చదువు ప్రాముఖ్యతను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా గ్రామ పెద్దలు, యువత తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా లిఖిత అనే బాలిక.. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, తాను భద్రాచలం గురుకులంలో ఐదో తరగతి పూర్తి చేసి ఆరో తరగతిలో ప్రవేశించానని చెప్పగా, డేవిడ్‌రాజ్ ఆ బాలికను అభినందిచారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఆర్లగూడెం, నారాయణపేట ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామారావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.